www.dainamicnews.com
శుభోదయ
డైనమిక్
ప్రజల కోసం - ప్రగతి కోసం
dianamicnews Tv
dianamicnews.epaper.com

విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న డైనమిక్ దినపత్రికలో అన్ని మండలాల వారీగా విలేకరులు కావలెను.
డైనమిక్
CELL : 96523 03089

తెలంగాణ- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | సోమవారం 26 అక్టోబర్ 2026 | వెల : 4/-

ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ డౌన్

- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- నిపుణుల హెచ్చరికలు
- శీతాకాలం సమీపించిన వేళ, ఢిల్లీలో మరోసారి కాలుష్యం కోరలు చాస్తోంది
- వాయు నాణ్యత తగ్గిపోయి హానికరగాలులతో దేశ రాజధాని ఉక్కిరిబిక్కిరవుతోంది.
- ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై ఇది తీవ్ర ప్రభావం

ఓటు నమోదుకు ముందుకు రాని
యువత!

- తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించి దాదాపు నెల రోజులు
- ఇప్పటివరకు 5,23,758 మంది మాత్రమే దరఖాస్తు
- మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పరిధిలో 2,29,937
- వరంగల్-ఖమ్మం-నల్గొండ పరిధిలో 2,93,821 మంది మాత్రమే దరఖాస్తు
- ఫారం-18 సమర్పించడానికి నవంబర్ 6 వరకే ఎన్నికల సంఘం అవకాశం
- ఈసారి ఆశించిన స్థాయిలో ఓటర్ల నమోదు కాకపోవడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యేకంగా క్యాంపులు పెట్టే అంశంపై దృష్టి
- మరోవైపు రెండు ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఫారం-18 ద్వారా వచ్చిన కొత్త దరఖాస్తుల విచారణ ఇంకా బీఎల్‌వో స్థాయిలోనే ఉండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

హైదరాబాద్

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓటు నమోదు (ఫారం-18) కోసం గ్రాడ్యుయేట్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించి దాదాపు నెల రోజులు కావొస్తున్నా శనివారం వరకు రెండు స్థానాలకు కలిపి 5,23,758 అప్లికేషన్లు మాత్రమే వచ్చాయి. కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం సెప్టెంబర్ 28న నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటివరకు మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పరిధిలో 2,29,937, వరంగల్-ఖమ్మం-నల్గొండ పరిధిలో 2,93,821 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఫారం-18 సమర్పించడానికి నవంబర్ 6 వరకే ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 2021లో జరిగిన ఎన్నికల్లో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పరిధిలో 5,31,268 మంది, వరంగల్-ఖమ్మం-నల్గొండ పరిధిలో 5,05,565 మంది కలిపి మొత్తంగా రెండు నియోజకవర్గాల్లో 10 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఈసారి ఆశించిన స్థాయిలో ఓటర్లు నమోదు - మిగతా3లో

హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై
ఏఐ నిఘా

- ట్రాఫిక్, వ్యర్థాల నియంత్రణే లక్ష్యంగా ఏర్పాట్లు
- హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఈ ఏఐ కెమెరాల ప్రణాళిక సిద్ధం
- మరికొన్ని రోజుల్లో దీనిని అందుబాటులోకి తీసుకురానున్నారు.
- నిర్మాణ వ్యర్థాలు, చెత్త వేయకుండా కట్టడి చేసేందుకు ఏఐ - ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

హైదరాబాద్

హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), సర్వీసు రోడ్ల వెంట తరచూ చెత్తను పారేస్తూ ఉంటారు. దీనిని అరికట్టేందుకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఒక ప్రణాళికను రూపొందించింది. నిర్మాణ వ్యర్థాలు, చెత్త వేయకుండా కట్టడి చేసేందుకు ఏఐ - ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా అక్రమంగా వ్యర్థాలను పారబోసే వాహనాలను ఆటోమేటిక్‌గా గుర్తించి, వాటి లైసెన్స్ ప్లేట్ నంబర్లను నమోదు చేస్తుంది. అలా చెత్త వేసిన వారికి భారీ జరిమానాలు విధించనున్నారు. అంతేకాకుండా ఓ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తుంది. దీనిద్వారా వ్యర్థాలను వేస్తున్న వాహనాలపై తక్షణ చర్యలు తీసుకొనే వీలుంటుంది. ప్రస్తుతం అండర్‌పాస్‌ల సమీపంలో జనసంచారం తక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాలలో - మిగతా3లో

ఉగ్రవాదం ప్రపంచ శాంతికి ప్రాణాంతకమైన ముప్పు

- ఉగ్రవాదాన్ని రాజకీయ సాధనంగా ఉపయోగించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు
- ప్రపంచ దేశాలు దృఢ సంకల్పంతో ఏకమై దీనిని ఎదిరించాలని పిలుపు
- విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్

ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు



- బ్యాంకింగ్ రంగానికి సైబర్ ముప్పు
- రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయి
- భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది
- 'నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగవని మనందరికీ తెలుసు
- ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

రైస్ మిల్లర్ల అక్రమాలపై
ఉక్కుపాదం

- సన్నబియ్యం సరఫరాలో అక్రమాలపై రంగంలోకి సీఐడీ
- 14 మంది మిల్లర్లు అరెస్ట్
- నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులపై సీబీసీఐడీ అధికారులు దాడులు
- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మకం
- పౌర సరఫరాల సంస్థ అధికారుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన దర్యాప్తు బృందం
- ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు నమోదు.. 14 మంది మిల్లర్లను అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడి

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రైస్ మిల్లర్ల అక్రమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వం ఇచ్చిన నాణ్యమైన సన్న రకం ధాన్యాన్ని పక్కదారి పట్టించి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి దొడ్డు రకం బియ్యం అప్పగిస్తున్న అక్రమార్కులపై సీఐడీ విభాగాన్ని రంగంలోకి దించింది. పౌర సరఫరాల సంస్థ అధికారుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన దర్యాప్తు బృందం, ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి, 14 మంది మిల్లర్లను అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. 2025--26 ఖరీఫ్ సీజన్‌లో పౌర సరఫరాల శాఖ 71.86 లక్షల మెట్రిక్ - మిగతా3లో

మోదీపై ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

- చెలరేగిన రాజకీయ దుమారం
- దేశవ్యాప్తంగా నిరసనలకు బీజేపీ సిద్ధం!
- ప్రధాని మోదీకి, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్
- ప్రభుత్వం ప్రజాస్వామ్య సూత్రాల్ని ఉల్లంఘిస్తోంది
- సర్ ప్రక్రియ ద్వారా ఎన్నికల్ని ప్రభావితం చేస్తోంది
- ఓ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ తండ్రిని ప్రస్తావిస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీయగా

చిల్లర కోసం
గొడవ

- మహిళా కండక్టర్‌ను బస్సులోంచి తోసేసిన ప్రయాణికురాలు
- టికెట్ విషయంలో మొదలైన వాగ్వాదం
- చిల్లర విషయంలో పెరిగిన వివాదం
- కదులుతున్న బస్సు కింద పడి గాయాలు
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు

హైదరాబాద్

ప్రయాణికురాలితో చిల్లర విషయంలో జరిగిన వాగ్వాదం ఓ మహిళా ఆర్టీసీ కండక్టర్‌కు తీవ్ర గాయాలు కావడానికి దారితీసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో టికెట్ తీసుకోవడం, మిగిలిన చిల్లర ఇవ్వడం వంటి విషయాలపై మొదలైన వివాదం చివరకు ప్రమాదానికి దారితీసింది. కండక్టర్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిట్టగూడెంకు చెందిన ఓ ప్రయాణికురాలు మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు - మిగతా3లో

విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని నమ్మి, విద్య కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప నాయకుడు ఉప్పుల ఉప్పయ్య....

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు

సిరికొండ: విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని బలంగా విశ్వసించి, పేద విద్యార్థులకు విద్య అందించేందుకు నిరంతరం కృషి చేసిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడు ఉప్పుల ఉప్పయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు అన్నారు. సీపీఎం నాయకులు, డీవైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు ఉప్పుల ఉప్పయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మోతె మండలం సిరికొండ గ్రామంలో ఆయన మృతదేహాన్ని సందర్శించిన మట్టిపల్లి సైదులు, ఎర్రజెండాను కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో నిర్వహించిన సంతాప సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మట్టిపల్లి సైదులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన ఉప్పుల ఉప్పయ్య అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ జీవితాంతం కమ్యూనిస్టుగా జీవించారని కొనియాడారు. సమాజంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరికీ విద్య అందాలని, ముఖ్యంగా పేద కుటుంబాల పిల్లలు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన నిరంతరం తపించేవారని తెలిపారు. అనేకమంది విద్యార్థులకు చదువు చెప్పి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని, ఆయన కృషి, ప్రోత్సాహం వల్ల పలువురు విద్యార్థులు నవోదయ పాఠశాలలు, గురుకులాల్లో ఉద్యోగాలు సాధించారని గుర్తుచేశారు. ఎంతోమంది జీవితాల్లో విద్య ద్వారా వెలుగులు నింపిన వ్యక్తి ఉప్పయ్య అని అన్నారు. డీవైఎఫ్ఐ మోతెమండలఅధ్యక్షుడిగా, కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యుడిగా ఉప్పయ్య బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజాఉద్యమాలు నిర్వహించారనిపేర్కొన్నారు. ఈ దేశంలో పుట్టిన ప్రతి మనిషికి విద్య, వైద్యం, ఉపాధి అందాలని పోరాటాలు చేసిన ప్రజా ఉద్యమ నాయకుడని కొనియాడారు. నిరుద్యోగ యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని, దీనివల్ల యువత భవిష్యత్తు

దెబ్బతింటోందని ఉప్పయ్య ఆందోళన చెందేవారని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు, ఉద్యోగాలు లభించే వరకు నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేస్తూ అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రైతాంగం, కార్మికులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై, వారికి నష్టం కలిగించే విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రజా పోరాటాల్లో ఉప్పుల ఉప్పయ్య చురుకుగా పాల్గొన్నారని అన్నారు. పేదలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, నిరుద్యోగ యువత హక్కుల సాధన కోసం తన శక్తిమేరకు కృషి చేశారని తెలిపారు. వ్యక్తిగత జీవితంలో అనేక కష్టాలు ఎదురైనా ప్రజా సమస్యలపై పోరాటాన్ని వీడకుండా, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి చివరి వరకు జీవించారని పేర్కొన్నారు. ఉప్పుల ఉప్పయ్య మరణం సీపీఎం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య ద్వారా పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే ఆయన ఆశయం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఉప్పయ్య ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని, ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం, ఉపాధి అందే సమాజ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంతాప సభలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొని ఉప్పుల ఉప్పయ్యకు ఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలాపించిన గేయాలు పలువురిని ఆకట్టుకున్నాయి. సిపిఎం శాఖ కార్యదర్శి కాంపాటి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బచ్చల కూర స్వరాజ్యం, సిరికొండ గ్రామ సర్పంచ్ బొర్రా వెంకటేష్, మాజీ ఎంపీటీసీ కాంపాటి వెంకన్న, మాజీ సర్పంచ్ మామునూరి ఉపేందర్, సిపిఎం మండల నాయకులు కిన్నెర పోతయ్య, పి దమర్తి అశోక్, దోసపాటి శ్రీనివాస్, జంపాల స్వరాజ్యం, వెలుగు మధు, కాంపాటి జానయ్య, దోసపాటి చిన్న శ్రీను, మీసాల వెంకన్న, నవిలే వెంకన్న, గురజాల నాగయ్య, వెంకటమ్మ, బోడ పట్ల హుస్సేన్, కొండ శ్రీరాములు, పొడపంగి దేవయ్య, సతీష్, పల్లెల్లె రామ్ లక్ష్మణ్, లచ్చుమల్ల సత్యం, శాంతినికేతన్ హై స్కూల్ కరస్పాండెంట్ దోసపాటి ఎల్లయ్య, శ్రీ వెంకటేశ్వర విద్యా నిలయం కరస్పాండెంట్ జానీమియా, బిఆర్ఎస్ నాయకులు జిల్లా పల్లి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 28న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమావేశం

సమావేశాన్ని జయప్రదం చేయాలి: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు

హైదరాబాద్, శుభోదయ డైనమిక్ వార్త ఈనెల 28న హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో నిర్వహించనున్న బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ దశరథ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అంబటి బాపురాజుతో కలిసి ఆయన పాత్రికేయులతో మాట్లాడారు.

గ్రామస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేస్తాం

తెలంగాణ రాష్ట్రంలో బీసీ హక్కుల సాధన సమితిని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ధనుంజయ నాయుడు తెలిపారు. ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టడంతోపాటు గ్రామ, మండల, జిల్లా శాఖలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో సంఘం మహాసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

బీసీల హక్కుల కోసం ఉద్యమం

బీసీ హక్కుల సాధన సమితి బీసీల పక్షాన నిలబడి వారి హక్కుల సాధన కోసం నిరంతరం ఉద్యమిస్తోందని తెలిపారు. దాదాపు శతాబ్దం తర్వాత దేశంలో కులగణన కోసం జరుగుతున్న పోరాటంలో తమ సంఘం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత సమయంలో కులగణన జరగకపోతే బీసీలు మరో పదేళ్లపాటు వెనుకబాటుతనాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని బీసీలందరూ గుర్తించాలని కోరారు.

బీసీల రక్షణకు బీజేపీ నేతలు ముందుకు రావాలి

ముఖ్యంగా బీజేపీలో ఉన్న బీసీ నాయకులు మౌనం వీడి, బీసీల హక్కుల పరిరక్షణ కోసం తమ నైతిక బాధ్యతను నిర్వర్తించాలని ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు. బీసీల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. ఈనెల 28న నిర్వహించే రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు

రేపు సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం

పౌరులు, యువత స్వచ్ఛందంగా పాల్గొనాలి: ఎస్పీ కె. నరసింహ

శుభోదయ డైనమిక్ న్యూస్, సూర్యాపేట బ్యూరో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం (అక్టోబర్ 26న) సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ తెలిపారు.

ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం

రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

యువతకు ఎస్పీ పిలుపు

యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని ఎస్పీ కోరారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

పెండింగ్ డీఏ బకాయిలను చెల్లించాలి

నేరేడుచర్లలో మూడు మండలాల టీఎస్ యూటీఎఫ్ మహాసభలు

శుభోదయ డైనమిక్ న్యూస్, నేరేడుచర్ల: పెండింగ్‌లో ఉన్న పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ను వెంటనే అమలు చేయడంతో పాటు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన కరువు భత్యం (డీఏ) బకాయిలను తక్షణమే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేరేడుచర్లలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) ఆధ్వర్యంలో నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకీడు మండలాల మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.

హామీలను నెరవేర్చాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 రోజుల్లో పెండింగ్ డీఏలు చెల్లిస్తామని, పీఆర్సీ అమలు చేస్తామని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చిందని అనిల్ కుమార్ గుర్తుచేశారు. అయితే, ఇప్పటివరకు ఆ హామీలు పూర్తిస్థాయిలో నెరవేరలేదని విమర్శించారు. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ బకాయిలను కూడా తక్షణమే చెల్లించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టడంతో పాటు ఇప్పటికే ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు భోజన ధరలను పెంచాలని, పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పలువురు ఉపాధ్యాయ నాయకుల పాల్గొనడం

ఈ మహాసభల్లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె. బాలసైదిరెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్. సాంబయ్య, నేరేడుచర్ల మండల అధ్యక్షుడు ఆర్. శ్రీనయ్య, ప్రధాన కార్యదర్శి బి. అక్కయ్య బాబు, గరిడేపల్లి మండల అధ్యక్షుడు బి. నాగేశ్వరరావు, పాలకీడు మండల అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఎల్. శ్రీనివాసరావు, ఎన్. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్. వెంకటేశ్వర్లు, సీహెచ్. వెంకటేశ్వరరావు, కె. వెంకటేశ్వరరావు, బి. వెంకట నరసయ్య, ఆర్. రవీందర్ రెడ్డి, వై. రామానుజం, ఎం.డి. మజీదా బేగం, డి. సైదమ్మ, టి. రాఘవరెడ్డి, బి. జైహింద్, ఎల్.వి. శేఖర్, బి. మహేష్, వి. రవీందర్ రెడ్డి తదితర ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

దిల్లీలో ఎయిర్ క్వాలిటీ డౌన్

కొన్నేళ్లుగా శీతాకాలం వస్తోందంటే చాలు దిల్లీ ప్రజలను చలితో పాటు కాలుష్య భయమూ వెంటాడుతోంది. పొగమంచు, పడిపోతున్న గాలి నాణ్యత ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలాంటి శ్వాసకోశ సమస్యలు లేనివారిని సైతం ఈ విషగాలి వదలడం లేదు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఈ కాలుష్యానికి అత్యంత సులువుగా బలవుతున్నారు. ఆస్తమా, జుబ్బాణ వంటి దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు ఉన్నవారికి వాయు కాలుష్యం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కేవలం ఊపిరితిత్తులకే కాకుండా, ఇది హృద్రోగాలకూ దారితీసి, గుండెపోటు ముప్పును గణనీయంగా పెంచుతుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "కాలుష్యం పెరిగితే సమస్యలు తీవ్రమవుతాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆస్తమా, సీఓపీడి, ఊపిరితిత్తుల్లో ఫైబ్రోసిస్ లాంటి ముందస్తు సమస్యలు ఉన్నవారికి ఈ కాలుష్యం శాపంగా మారుతుంది. ఇక గర్భిణీలు కూడా దీనివల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది"

దేశ రాజధానిలో కాలుష్య కోరల నుంచి రక్షించుకోవడానికి ప్రజలు తక్షణ స్వీయజాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ స్థాయిలను బట్టి బయటకు వెళ్లాలో, వద్దో తమపై తామే ఆంక్షలు విధించుకోవాలని స్పష్టం చేస్తున్నారు. "ఈ సీజన్‌లో గాలి నాణ్యత దెబ్బతింటుంది. ఏక్యూఐ300 దాటితే శ్వాసకోశ, గుండె జబ్బులు ఉన్నవారు బయట తిరగడం తగ్గించాలి. అదే 400 దాటితే అసలు బయటకు రాకూడదు. ఇక ఏక్యూఐ 200 నుంచి 300 మధ్య ఉంటే మాత్రం బహిరంగ ప్రదేశాల్లో వ్యాయామాలు పూర్తిగా మానుకోవాలి" అని ఊపిరితిత్తుల నిపుణుడు డా.వివేక్ నాంగియా తెలిపారు.

అనవసరంగా బయట తిరగకపోవడమే!

కాలుష్య ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఇళ్లలోని గాలి నాణ్యతను మెరుగుపరుచుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని జనరల్ ఫిజీషియన్లు సూచిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు... తగిన జాగ్రత్తలు తీసుకుంటూ..అనవసరంగా బయట తిరగకపోవడమే ఉత్తమమని చెబుతున్నారు.

"కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లేటప్పుడు మాస్క్ ధరించడం మంచి రక్షణ కవచంగా ఉంటుంది. అలాగే ఇళ్లలో, ఇండోర్‌లో గాలి నాణ్యతను మెరుగుపరచుకోవాలి. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు.. ఈ నిబంధనలను తప్పక పాటించాలి"

దిల్లీలో చలికాలం అంటే కేవలం ఉష్ణోగ్రతలు పడిపోవడం మాత్రమే కాదు. ఊపిరి సలపని గాలి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కొన్నేళ్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థ కాలుష్య నివారణకు కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పులు రావడంలేదు.

ఉగ్రవాదం ప్రపంచ శాంతికి ప్రాణాంతకమైన ముప్పు

ఉగ్రవాదాన్ని రాజకీయ సాధనంగా వాడుకోవడాన్ని అంగీకరించబోమని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. కొన్ని దేశాలు ఉగ్రవాదం పట్ల కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే ఈ ముప్పు ఇంకా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత అనుభవాలు ఎన్నో గుణపాఠాలు నేర్పుతున్నా, కొన్ని దేశాలు ఇప్పటికీ రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని పాకిస్థాన్‌ను పరోక్షంగా విమర్శించారు. దిల్లీలో జరిగిన చిన్మయ మిషన్ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన ఎక్కడో ఒక చోట జరిగే యుద్ధం, ప్రపంచమంతటా ఉన్న శాంతికి ముప్పుగా పరిణమిస్తుందని హెచ్చరించారు. "ఉగ్రవాదం శాంతికి మరో ప్రాణాంతక ముప్పు. దానిని రాజకీయ సాధనంగా ఉపయోగించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. దానిని ఎన్నటికీ సమర్థించలేం. ఎన్నడూ హేతుబద్ధం చేయలేం. అయినప్పటికీ, అన్ని దేశాలు ఏమాత్రం సహనాన్ని ప్రదర్శించకపోవడం వల్ల ఇది కొనసాగుతూనే ఉంది. చరిత్ర ఎన్నో పాఠాలు నేర్పినప్పటికీ, కొన్ని దేశాలు ఇప్పటికీ రాజకీయ లెక్కలకే ప్రాధాన్యతనిస్తున్నాయి."

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణలను ప్రస్తావించిన జైశంకర్ దౌత్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సంక్షోభాల సమయంలో ఐక్యరాజ్యసమితి కేవలం ప్రేక్షకపాత్ర వహించకూడదని, నాయకత్వం వహించి పరిష్కార మార్గాలకు బాటలు వేయలాని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం లోపభూయిష్టమైన ప్రపంచంలో జీవిస్తున్నామని, అయితే దాన్ని మరింత మెరుగుపరిచేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా దాని ప్రభావం ఆ ప్రాంతానికే పరిమితం కాదని జైశంకర్ స్పష్టం చేశారు. ఒక చోట జరిగే సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా శాంతికి ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. అందువల్ల అన్ని దేశాలు శాంతిని కాపాడేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదం, యుద్ధాలు ప్రపంచ దేశాల భద్రతతో పాటు అభివృద్ధిపైనా ప్రభావం చూపుతాయని ఆయన వ్యాఖ్యానించారు. చరిత్ర నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను కొన్ని దేశాలు విస్మరిస్తున్నాయని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదం విషయంలో రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, అన్ని దేశాలు ఒకే విధమైన కఠిన వైఖరిని అవలంబించాలని సూచించారు.

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలను ప్రస్తావిస్తూ, సమస్యలను పరిష్కరించుకోవడానికి దౌత్యం, చర్చలే మార్గమని జైశంకర్ అన్నారు. యుద్ధాల వల్ల ఏర్పడే సంక్షోభాలను మరింత తీవ్రతరం చేయకుండా, చర్చల ద్వారా పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. భారత్ మొదటి నుంచి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. చర్చలు, దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనే భారత వైఖరి ప్రపంచ దేశాల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని అన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం అనేక సమస్యలు ఉన్నప్పటికీ, పరిస్థితులను మెరుగుపరిచేందుకు దేశాలు నిరంతరం కృషి చేయాలని జైశంకర్ అభిప్రాయపడ్డారు. యుద్ధాలు, హింసకు బదులుగా శాంతి, సహకారం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రపంచ దేశాల మధ్య పరస్పర అవగాహన పెరిగినప్పుడే సంక్షోభాలకు పరిష్కారాలు కనుగొనడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

శ్రేయస్సు, అభివృద్ధి అందరికీ అందాలి

ప్రపంచంలో అభివృద్ధి, శ్రేయస్సు ఒకవైపు, సంఘర్షణ, హింస మరోవైపు ఉంటాయని జైశంకర్ అన్నారు. ఈ రెండింటినీ విడివిడిగా చూడలేమని పేర్కొన్నారు. ప్రపంచీకరణ, సంక్లిష్టమైన సరఫరా గొలుసులు, పరస్పరం అనుసంధానమైన మార్కెట్ల నేపథ్యంలో ఒక ప్రాంతంలో నెలకొనే అస్థిరత ఇతర ప్రాంతాలపైనా ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రపంచంలోని కొంతమంది ప్రజలు మాత్రమే శ్రేయస్సుతో జీవిస్తూ, మిగిలిన వారు లేమిలో కొనసాగితే స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదని జైశంకర్ పేర్కొన్నారు. ఉగ్రవాదం సహా ప్రపంచం ఎదుర్కొంటున్న ఉమ్మడి ముప్పులపై దేశాలు మరింత స్పష్టమైన అవగాహన పెంచుకోవాలని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ, అన్ని వ్యక్తీకరణల్లోనూ ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సమాజం దృఢ సంకల్పంతో ఏకం కావాలని పిలుపునిచ్చారు.

యాతవాకిళ్ల గ్రామంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం...!

శుభోదయం డైనమిక్ న్యూస్ మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంయాతవాకిళ్ల గ్రామంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రూ 9.40 కోట్లతో రెండు బీటీ రోడ్లకు మంజూరు. మఠంపల్లి మండలంలోని యాతవాకిళ్ల గ్రామం నుంచి అల్లిపురం వరకు, అలాగే యాతవాకిళ్ల నుంచి చెన్నై పాలెం వరకు రెండు బీట్ రోడ్ల నిర్మాణానికి మొత్తం రూ 9 కోట్ల 40 లక్షలు మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

ఈ సందర్భంగా యాతవాకిళ్ళ నుంచి అల్లిపురం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల బీట్ రోడ్డు నిర్మాణానికి 4 కోట్ల 20 లక్షలు, అదేవిధంగా యాతవాకిళ్ళ నుంచి చెన్నై పాలెం వరకు 5 5.కిలోమీటర్ల బీట్ రోడ్డు నిర్మాణానికి రూ 5 కోట్ల 20 లక్షలు మంజూరు చేయటం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ రహదారుల నిర్మాణంతో ఆయా గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచటంతో పాటు ప్రయాణ ఇబ్బందులు తగ్గాయని వారు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకరించి, ప్రజల అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేసిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కుక్కల కరుణ నాగరాజు, మఠంపల్లి మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఒంటి పులి శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఉప్పల ఉప్పయ్య మృతికి సంతాపంగా సోమవారం ప్రైవేట్ పాఠశాలల బంద్

మోతే: శ్రీ శాంతి నికేతన్ పాఠశాల డైరెక్టర్, ఉపాధ్యాయుడు ఉప్పల ఉప్పయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ సోమవారం మోతే మండలవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నిర్ణయించింది. ఉప్పయ్య మృతి పట్ల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి విద్యారంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ సత్యం శ్రీరంగం ఏకగ్రీవ ఎన్నిక

మేడ్చల్--మల్కాజిగిరి, అక్టోబర్ 25 శుభోదయ డైనమిక్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈరోజు నిర్వహించిన ఎరోస్ త్రోబాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా చిత్ర షనై, కోశాధికారిగా భాస్కర్ రెడ్డి ఎన్నికయ్యారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టీఎఫ్ఐ) తరఫున పరిశీలకుడిగా హాజరైన అమన్ శర్మ సమక్షంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్ర మంత్రి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సముద్రాల వేణుగోపాలాచారి, సీనియర్ న్యాయవాది మోక్షజ్ఞ హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలకు చెందిన త్రోబాల్ అసోసియేషన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో త్రోబాల్ క్రీడను ప్రోత్సహించి, అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం డాక్టర్ సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న అన్ని జిల్లాల ప్రతినిధులకు, అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో త్రోబాల్ క్రీడా ప్రతిభను వెలికితీయడం, యువ క్రీడాకారులను ప్రోత్సహించడం, రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేలా మెరుగైన అవకాశాలు కల్పించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కృష్ణ రాజ్‌పుత్, శ్రీరామోజు శివకుమార్, ఓడేలు యాదవ్, వడ్డెన్న, రవి, అనిల్, వినీషా, అలేఖ్య తదితర జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై ఏఐ నిఘా

-మొదటిపేజీ తరువాయి

రాత్రిపూట లారీలు, ట్రక్కులతో వచ్చి తరచూ వ్యర్థాలను పారేస్తున్నారు. గచ్చిబౌలి – నానక్‌రామ్‌గూడ, పెద్దఅంబర్‌పేట్–బాటసింగారం, పటాన్‌చెరు – శంకర్‌పల్లి, అలాగే మేడ్చల్ – షమీర్‌పేట్ మార్గాలలో ఈ సమస్య అధికంగా ఉంది.

మల్టీ-వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్

ఔటర్ రింగ్ రోడ్డుపై ట్రాఫిక్‌ను నిర్వహించడానికి సైబరాబాద్ పోలీసులు, హెచ్ఎండీఏ సహకారంతో ఏఐ ఆధారిత 'మల్టీ – వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్?'ను ప్రవేశపెడుతున్నారు. తరచుగా ప్రమాదాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు జరిగే 14 ప్రాంతాలను కవర్ చేస్తూ, శంషాబాద్ నుంచి మేడ్చల్ వరకు 70 కిలోమీటర్ల మేర ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉల్లంఘనలను గుర్తించి, పరిష్కరించగల సామర్థ్యం ఈ కెమెరాల ముఖ్య లక్షణం. రియల్? టైంలో ఈ-చలాన్లను జారీ చేయడాన్ని సులభతరం చేయడానికి ఉపయోగపడుతుంది.

నాలుగు కెమెరాలు ఏర్పాటు

ప్రస్తుతం ఈ వ్యవస్థను బంజారా హిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తోపాటు

బ్రహ్మంగారి గుడి వద్ద రహదారి గుంతకు మరమ్మతులు.. తొలగిన రాకపోకల ఇబ్బందులు

నడిగూడెం, అక్టోబర్ 25 (శుభోదయ డైనమిక్ వార్త): సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రం నుంచి కాగిత రామచంద్రపురం వెళ్లే మార్గంలో బ్రహ్మంగారి గుడి వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతకు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. రద్దీగా ఉండే ఈ రహదారిపై గుంత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సి వచ్చేది. ఈ మార్గం గుండా నిత్యం పలు గ్రామాలకు వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో గుంత వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. గుంతలో వాహనాలు దిగడంతో వాహనాలు దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. సమస్యను గుర్తించిన ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులకు ఇబ్బందులు తొలగి రాకపోకలు సజావుగా సాగేందుకు మార్గం సుగమమైంది.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కోసం బీఆర్ఎస్ ప్రచారం

నడిగూడెం, అక్టోబర్ 25 (శుభోదయ డైనమిక్ వార్త): బీఆర్ఎస్ నడిగూడెం మండల పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వల్లాపురం, సిరిపురం, కోడిపుంజులగూడెం, రామచంద్రపురం గ్రామాల్లో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకునేలా గ్రామ కోఆర్డినేటర్లు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులు, యువత, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రభుత్వంపై తమ నిరసనను ఓటు ద్వారా తెలియజేయాలని, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు అనంతుల ఆంజనేయులు, గార్లపాటి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, కోఆర్డినేటర్లు నూకపొంగు ఈదయ్య, ఉపేందర్ రెడ్డి, ఎలగొండ నాగేశ్వరరావు, కొత్తపల్లి అజయ్, నాగేందర్, నారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, లింగయ్య, జోగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇందిర అనాధ వృద్ధాశ్రమంలో అన్న ప్రసాద వితరణ....

శుభోదయడైనమిక్ న్యూస్ మునగాల అక్టోబర్ 25

మునగాల మండల పరిధిలోని ముకుందా పురం గ్రామ పంచాయతీ శివారు లో ఉన్న ఇందిరా అనాధ వృద్ధాశ్రమంలో తాడవాయి గ్రామానికి చెందిన జిల్లేపల్లి శ్రీనివాస్ దివ్యభారతిల కుమారుడు ప్రజ్వల్ పుట్టిన రోజు సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాడ్వాయి సర్పంచ్ కొలిశెట్టి రాంబాయమ్మ బుచ్చిపాపయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు పాల్గొన్నారు.అనంతరం ఫాస్టర్ లూకా పార్దన చేసి ఆశీర్వదించారు. మాట్లాడుతూ. అన్నదానం మహా పుణ్యకార్యమని. అదేవిధంగా ఇలాంటి. ఆశ్రమాలలో ఉన్న అనాధలకు వృద్ధులకు మానసిక వికలాంగులకు. ఇలా పండుగల సందర్భంగా. అన్నదాన కార్యక్రమం నిర్వహించిడం. అభినందనీయం అని ప్రతి ఒక్కరు. ఇలాంటి అనాథ శరణాలకు వృద్ధాశ్రమాలకు అండగా నిలవాలని. అలాగే. దాతృత్వం గల దాతల ముందుకు వచ్చి. ఇలాంటి ఆశ్రమాలకు అవసరమైన వివిధ రకాల సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రావాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సోమపంగు గోపి, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర కోసం గొడవ

-మొదటిపేజీ తరువాయి

బస్సు ఎక్కారు. ఆమెతో పాటు ఉన్న బాలుడికి టికెట్ తీసుకోవాలని మహిళా కండక్టర్ సూచించారు. అయితే, మొదట టికెట్ తీసుకోవడానికి ప్రయాణికురాలు నిరాకరించింది. కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం బాలుడికి టికెట్ తీసుకునేందుకు అంగీకరించారు. టికెట్ కోసం కండక్టర్?కు ప్రయాణికురాలు డబ్బులు ఇచ్చారు.

చిల్లర విషయంలో పెరిగిన వివాదం

టికెట్ ఇచ్చిన కండక్టర్ ప్రయాణికురాలు దిగేటప్పుడు మిగిలిన చిల్లర తీసుకోవాలని సూచించారు. అయితే, ఇప్పుడే చిల్లర ఇవ్వాలని ప్రయాణికురాలు పట్టుబట్టింది. దీంతో మరోసారి వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మిట్టగూడెం స్టాప్ రావడంతో ఆమె బస్సు దిగేందుకు ప్రయత్నం చేశారు. పరిస్థితి తీవ్రం కావడంతో ప్రయాణికురాలిని అశ్వాపురం పోలీస్? స్టేషన్‌కు తీసుకెళ్లాలని కండక్టర్ నిర్ణయం తీసుకున్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో జర్నలిస్టు చిమాట నాగరాజుకు సన్మానం



కోదాడ, శుభోదయ డైనమిక్ వార్త తెలుగు జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా కోదాడకు చెందిన శుభోదయ డైనమిక్ వార్త ప్రతినిధి చిమాట నాగరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఆత్మీయంగా కలుసుకొని పరస్పర అభిప్రాయాలను పంచుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమం, ఐక్యత, వృత్తిపరమైన అభివృద్ధికి ఇటువంటి ఆత్మీయ సమ్మేళనాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

కెమిస్ట్రీ వెంకటేశ్వరరావు సేవలు చిరస్మరణీయం..

కెమిస్ట్రీ వెంకటేశ్వరరావు మృతి కోదాడ పబ్లిక్ క్లబ్‌కు తీరని లోటు....

కోదాడ శుభోదయ డైనమిక్ వార్త అక్టోబర్ 25 కోదాడ పబ్లిక్ క్లబ్ శాశ్వత సీనియర్ సభ్యులు, క్లబ్ అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించిన కెమిస్ట్రీ వెంకటేశ్వరరావు మృతి తీరని లోటని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆయన సేవలను కొనియాడుతూ ఆదివారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆవరణలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత శిఖరాలు ఎదిగేందుకు అహర్నిశలు కృషి చేశారని, తన చివరి శ్వాస వరకు క్రమశిక్షణగా, ఆదర్శప్రాయంగా జీవించారాని తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి వారి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కత్రం సీతారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి పోటు రంగారావుతో పాటు సీనియర్ శాశ్వత సభ్యులు ఎస్ ఆర్ కే మూర్తి, రావెళ్ల సీతారామయ్య, పారా సీతయ్య, ఆవుల రామారావు, చింతలపాటి శ్రీను, రామిరెడ్డి, కత్రం శివాజీ రెడ్డి, చింతలపాటి శేఖర్, వంగవీటి గురునాథం, తోట రంగారావు, విద్యాసాగర్, మేకల వెంకట్రావు, ప్రతాప్, గుండపునేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవపురం--తుమ్మలపల్లి రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలి

రైతులు, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలి: మేకల నాగరాజు

నడిగూడెం, అక్టోబర్ 25 (శుభోదయ డైనమిక్ వార్త): సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం చెన్నకేశవపురం మీదుగా మోతె మండలం తుమ్మలపల్లికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారి, కంకర తేలడంతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సూర్యాపేట జిల్లా బీజేపీ ఓబీసీ కార్యదర్శి మేకల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని, ముఖ్యంగా రైతులు వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గుంతల కారణంగా వాహనాలు దెబ్బతినడంతో పాటు ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతోందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రహదారిని పరిశీలించి గుంతలను పూడ్చాలని, తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారంగా తారు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మేకల నాగరాజు డిమాండ్ చేశారు. రైతులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిధులు కేటాయించి రహదారి అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు.

వల్లాపురంలో నూర్‌బాషా దూదేకుల ఆత్మీయ సమ్మేళనం

ర్యాలీలో పాల్గొన్న సుమారు 700 మంది కులస్తులు

వల్లాపురం, అక్టోబర్ 25 (శుభోదయ డైనమిక్ వార్త): సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం వల్లాపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు, జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే సయ్యద్ భాషా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగిన ర్యాలీ అనంతరం సభా ప్రాంగణంలో నిర్వహించిన సమ్మేళనంలో సుమారు 700 మంది దూదేకుల కులస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట జిల్లా జేఏసీ అధ్యక్షులు మీరా, రహీం మీరా, జిల్లా నాయకులు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎస్‌కే రహీం పాషా పాల్గొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులు ఎస్‌కే సయ్యద్ హుస్సేన్, ఉపాధ్యక్షులు ఆదం షరీఫ్, జానీపాషా జానీ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాసీం, ప్రధాన కార్యదర్శి సొందుపాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీలు రహీం, సైదులు, సయ్యద్ మీరా, కోశాధికారి ఎస్‌కే గాలిబ్, సహాయ కార్యదర్శులు పాషా, సయ్యద్ మీరా, మాదార్ సాహెబ్, ఖాజామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ఓ చెప్పకుండానే నిర్ధారణలకు వచ్చారా?

దిశ పత్రిక కథనంపై నల్లమల్ల రామారావు తీవ్ర అభ్యంతరం

'విచారణ చేసిన విషయం ఎవరికీ అధికారికంగా చెప్పలేదు" ఎంఆర్ఓ

శుభోదయ డైనమిక్ న్యూస్, నేరేడుచర్ల:సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం పరిధిలోని పెంచికల్‌దిన్నె గ్రామ శివారులో సర్వే నంబర్ 82 భూమికి సంబంధించిన వివాదంపై దిశ పత్రికలో ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. ఈ కథనంపై నల్లమల్ల రామారావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంఆర్ఓ అధికారికంగా వెల్లడించని విషయాలను నిర్ధారిత అంశాలుగా పేర్కొంటూ కథనం ఎలా రాస్తారని ఆయన ప్రశ్నించారు.

విచారణ వివరాలు చెప్పలేదన్న ఎంఆర్ఓ

ఈ వ్యవహారంపై ఎంఆర్ఓను సంప్రదించగా, తాను క్షేత్రస్థాయిలో విచారణ చేసిన విషయం ఎవరికీ అధికారికంగా వెల్లడించలేదని తెలిపినట్లు సమాచారం. దీంతో విచారణలో తేలిన అంశాలను అధికారికంగా వెల్లడించకముందే, వాటి ఆధారంగా నిర్ధారణలకు వచ్చినట్లు కథనం ప్రచురించడం ఎలా సాధ్యమైందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అధికారిక సమాచారం లేకుండానే కథనమా?

భూమి వివాదాలపై వార్తలు ప్రచురించే సమయంలో సంబంధిత అధికారుల వివరణ తీసుకోవడం, భూమి రికార్డులను పరిశీలించడం, నిర్ధారిత సమాచారానికే ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. విచారణ నివేదికలోని వివరాలు అధికారికంగా వెల్లడికాని పరిస్థితుల్లో, వాటి ఆధారంగా నిర్ధారిత వాస్తవాలుగా భావించేలా కథనం రాయడంపై నల్లమల్ల రామారావు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

వాస్తవాలు ప్రజలకు తెలియాలి

సర్వే నంబర్ 82 భూమి వివాదంపై రెవెన్యూ అధికారులు నిర్వహించిన విచారణలో ఏమి తేలింది? దిశ పత్రికలో ప్రచురితమైన కథనానికి ఆధారాలేమిటి? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. సంబంధిత అధికారులు, కథనం ప్రచురించిన పత్రిక ప్రతినిధి తమ వివరణ ఇవ్వాలని నల్లమల్ల రామారావు కోరుతున్నారు.విచారణలోని వాస్తవాలు అధికారికంగా వెల్లడైతేనే ఈ వివాదంపై స్పష్టత వచ్చే

అవకాశం ఉంది. ఆధారాలతో కూడిన వార్తలే ప్రజలకు చేరాలని, అధికారుల పేరుతో నిర్ధారణ కాని అంశాలను ప్రచురించకూడదని నల్లమల్ల రామారావు అభిప్రాయపడుతున్నారు.

ఢిల్లీ కాంగ్రెస్ మహా ర్యాలీకి తరలివెళ్లేందుకు సన్నాహాలు

నడిగూడెం, కోదాడ, మునగాల మండలాల కాంగ్రెస్ నాయకుల సమావేశం

నడిగూడెం, అక్టోబర్ 25 (శుభోదయ డైనమిక్ వార్త): ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న "ఓటు బచావో -- దేశ్ బచావో" జన మార్చ్, మహా ర్యాలీలో పాల్గొనేందుకు సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ నాయకులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నడిగూడెం, కోదాడ, మునగాల మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సూర్యాపేటలో సమావేశమై ప్రయాణ ఏర్పాట్లు, నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యంపై చర్చించారు. ఈ సమావేశంలో నడిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొక్క భిక్షపతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పల్లపు శ్రీను, కోదాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వట్టిపులి వెంకటేశ్, మునగాల మండలానికి చెందిన కాసర్ల కోటయ్య, సామేల్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు. నవంబర్ 1న ఢిల్లీకి చేరుకునేలా ప్రయాణ ప్రణాళిక రూపొందించడం, నాయకులు, కార్యకర్తలను సమన్వయంతో తరలించడం వంటి అంశాలపై చర్చించారు.ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరగనున్న ఈ మహా ర్యాలీలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (గా×=), ఓటు హక్కుల పరిరక్షణ తదితర అంశాలను కాంగ్రెస్ పార్టీ ప్రస్తావించనుంది. జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొనేలా ప్రయాణ ఏర్పాట్లను సమన్వయం చేసుకోవాలని సమావేశంలో చర్చించారు.

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించే 'ఓట్ బచావో దేశ్ బచావో' సభను విజయవంతం చేయాలి

ఏఐసీసీ పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి

శుభోదయ డైనమిక్ న్యూస్, అక్టోబర్ 25, సూర్యాపేట :సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య అధ్యక్షతన 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా ఆదివారం సూర్యాపేట డీసీసీ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి , నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి , వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ , వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు విలువ, ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి పార్టీలతో కలిసి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు,

కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాదాపు వందేళ్ల క్రితం నాటి సైమన్ కమిషన్‌తో ప్రస్తుత పరిస్థితులను పోలుస్తూ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరగాలని, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు ఈ అంశంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 'ఓట్ బచావో -- దేశ్ బచావో' నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని సర్వోత్తమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి భారత పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధారావత్ వీరన్న నాయక్, ముస్కు రాంచంద్రరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వేములపల్లి వాసుదేవరావు, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట మీదుగానే బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని కొనసాగించాలి

శుభోదయ డైనమిక్ న్యూస్, అక్టోబర్ 25, సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించిన బుల్లెట్ రైలు సాధన పోరాట కమిటీ సూర్యాపేట జిల్లా నాయకులు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బుల్లెట్ రైలు మార్గాన్ని మొదటి సర్వే ప్రకారము జాతీయ రహదారి సమాంతరంగా సూర్యాపేట మీదుగాని కొనసాగించాలని కోరుతూ సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన పోరాట కమిటీ నాయకులు రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నాడు ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేయం నరేందర్ రెడ్డి తో ఆయన నివాసంలో సమావేశమై వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా నాయకులు బుల్లెట్ ట్రైన్ కారిడార్ అలైన్మెంట్ మారుస్తూ రాష్ట్ర క్యాబినెట్ చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారిని కోరారు రాష్ట్ర విభజన చట్టంలో హైదరాబాదు నుండి విజయవాడ స్పీడ్ రైల్ కారిడార్ హామీ ఉన్నదని దానికి అనుగుణంగా బుల్లెట్ ట్రైన్ కారిడార్ ను ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



సర్వేలన్నీ కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టిలో ఉన్నాయని ఇంకా ఏది ఫైనల్ కాలేదని సూర్యాపేట ప్రాంత ప్రజల అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశం లో బుల్లెట్ ట్రైన్ మరియు రైల్వే కారిడార్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ ఆరుట్ల జానకి రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పటేల్ రమేష్ రెడ్డి,పెద్దిరెడ్డి రాజా, తండు శ్రీనివాస్ యాదవ్, కమిటీ నాయకులు ధర్మార్జున్, రమణాచారి, దేవిడ్ కుమార్,చ లమల నరసింహ, బూర వెంకటేశ్వర్లు, దారావత్ వెంకన్న వెలుగు వనిత, భూపతి రాములు, అనంతుల మధు, ఎర్ర అఖిల్, పెద్దిరెడ్డి కళ్యాణ్, నేరెళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

జలసంరక్షణే శ్రీరామరక్ష

నీటిబొట్టును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎడారే.. ప్రజల బాధ్యతతో పాటు ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం! ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పు లు తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి. ఇందులో ప్రధానంగా భారత్ లాంటి వ్యవసాయ ఆధారిత దేశాలను వణికిస్తున్న అతిపెద్ద సమస్య 'ఎల్‌నినో'. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ పరిస్థితి.. మన దేశంలో రుతుపవనాల గమనాన్ని దెబ్బతీసి, తీవ్ర కరవు పరిస్థితులకు, అకాల వర్షాలకు కారణమవుతోంది. దీనివల్ల తాగునీటి ఎద్దడి, సాగునీటి కొరత, ఆహార సంక్షోభం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా.. ప్రభుత్వ యంత్రాంగం, సామాన్య ప్రజలు సంయుక్తంగా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు ఆకాశం నుంచి కురిసిన వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది.. మరోవైపు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు నీటితో కళకళలాడిన చెరువులు నేడు కబ్జాలకు గురవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. అయినా మన నీటి వినియోగపు అలవాట్లలో ఆశించిన మార్పు రావడం లేదు. ఈ పరిస్థితి ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. మన నిర్లక్ష్యానికి కూడా అద్దం పడుతోంది. నీటి సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత పరిష్కారాల కోసం పరుగులు తీయడం కంటే, నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. తగ్గుతున్న జలవనరులు.. పెరుగుతున్న ముప్పు జలం లేనిదే జీవం లేదు. వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజారోగ్యం, పర్యావరణం.. ఇలా ప్రతి రంగానికీ నీరే ఆధారం. కానీ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, భూగర్భజలాల అధిక వినియోగం, చెరువులు కుంటల ఆక్రమణలు, వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం జలవనరులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. పట్టణాల్లో కాంక్రీటు నిర్మాణాలు విస్తరించడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో సంప్రదాయ జలవనరుల నిర్వహణ బలహీనపడుతున్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత సమస్యగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేక పోవడం, ఎండాకాలంలో నీటి కోసం ఇబ్బందులు పడటం మన జల నిర్వహణలోని లోపాలను స్పష్టం చేస్తున్నాయి. భూమిలోకి చేరుతున్న నీటికంటే బోర్లద్వారా తోడుతున్న నీరు ఎక్కువైతే భూగర్భజలాల మట్టం తగ్గిపోవడం తప్పదు. దీని ప్రభావం తాగునీటి సరఫరాపైనే కాకుండా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపైనా పడుతుంది. ప్రతి ఇంటి నుంచే మార్పు మొదలవ్వాలి. నీటి సమస్యను ప్రభుత్వం మాత్రమే పరిష్కరించలేదని, ప్రజలు మాత్రమే పరిష్కరించలేరని గుర్తించాలి. ఇరువురి భాగస్వామ్యం తప్పనిసరి. వర్షాకాలంలో ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని సేకరించి భూమిలోకి ఇంకేలా చేయడానికి ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. నీటి సంరక్షణ అంటే నీటిని తక్కువగా వినియోగించడం మాత్రమే కాదు.. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించడం కూడా. ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం. జలసంరక్షణలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా ఫలితాలు కనిపించే చర్యలు చేపట్టాలి. ముందుగా గ్రామాలు, పట్టణాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర సహజ జలవనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ఆక్రమణలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తొలగించి, నీరు చేరే మార్గాలను పునరుద్ధరించాలి. అవసరమైన చోట పూడికతీత చేపట్టి, చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు సహజంగా ప్రవహించే మార్గాలు మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. కొత్త భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు అయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో ఈ వ్యవస్థల నిర్వహణను పర్యవేక్షించాలి.ఇంకుడు గుంతలు నిర్మించడం వరకే కాకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని నీటి లభ్యత, వినియోగం, వృథా, భూగర్భజలాల పరిస్థితిని అంచనా వేసి స్థానిక జల ప్రణాళికలు రూపొందించాలి. తాగునీటి పైపుల లీకేజీలను త్వరగా సరిచేయాలి. నీటి సరఫరాలో జరిగే నష్టాలను తగ్గించాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని మెరుగుపరచడం అత్యవసరం. రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించాలి. నేల స్వభావం, వర్షపాతం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా శాస్త్రీయ సలహాలు అందించాలి. అవసరానికి మించి నీటిని పెట్టకుండా పంట అవసరాన్ని బట్టి సాగునీటిని అందించే పద్ధతులను ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, చిన్న నీటి నిల్వ కేంద్రాలను పునరుద్ధరించి వర్షపు నీటిని వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయాలి. రైతులకు సాంకేతిక సహాయం, శిక్షణ, సూక్ష్మ సేద్య పరికరాలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలి. మరిన్ని కనుగొనండి వార్తాపత్రిక యాక్సెస్ ప్రాంతీయ వార్తలు సేవ రాష్ట్ర వార్తలు సేవ మురుగునీటిని శుద్ధి చేసి, తాగునీరు అవసరం లేని పారిశ్రామిక, ఇతర పనులకు ఉపయోగించే వ్యవస్థలను పట్టణాల్లో బలోపేతం చేయాలి. జలసంరక్షణకు జవాబుదారీతనం అవసరం ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడం, నిధులు కేటాయించడం మాత్రమే సరిపోదు. వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలి. స్థానిక ప్రజలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను పర్యవేక్షణలో భాగస్వాములను చేయాలి. ఈ రోజు మనం కాపాడే ప్రతి నీటి బొట్టు రేపటి తరాల జీవనానికి భరోసా కావాలి. నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఈ రోజే జలసంరక్షణకు నడుం బిగించాలి. ప్రభుత్వాలు బాధ్యతతో ముందడుగు వేయాలి.. ప్రజలు భాగస్వాములు కావాలి.. జలసంరక్షణ ప్రతి ఇంటి సంకల్పంగా, ప్రతి గ్రామం లక్ష్యంగా, ప్రతి ప్రభుత్వ వ్యవస్థ కర్తవ్యంగా మారాలి. నీటిని కాపాడుకుందాం.. భవిష్యత్తును నిలబెట్టుకుందాం!

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA